# ప్రభుత్వ ఉద్యోగాలపై దృష్టి సారించాలి




మాట్లాడుతున్న కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సెల్ మేనేజర్ నాగేశ్వర్‌రెడ్డి

- ఇండియన్ అకాడమీ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సెల్ మేనేజర్ నాగేశ్వర్‌రెడ్డి
- కేంద్రప్రభుత్వంలో ఉద్యోగ అవకాశాలపై అవగాహన

వేములవాడ రూరల్, డిసెంబర్ 12 : డిగ్రీ పూర్తయిన తర్వాత విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించాలని ఇండియన్ అకాడమీ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సెల్ మేనేజర్ నాగేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరియర్ గైడెన్స్ సెల్, ఇండియన్ అకాడమీ ఆఫ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సంస్థ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగా వకాశాలపై అవగహన కల్పించారు. డిగ్రీ అర్హతతో అనేక రకాలైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు తగిన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోని వాటిని సాధించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకింగ్, రైల్వే రంగాల్లో అందుబాటులో ఉన్న వివిధ రకాలైన ఉద్యోగలు, సిలబల్ ప్రిపరేషన్‌పై సమగ్రంగా వివరించారు. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడే అవకాశం ఉన్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ తిరుకోవెల శ్రీనివాస్, అధ్యాపకులు మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, అఫ్సారీ ఉస్మాని, రమాదేవి, ప్రభాకర్, రాజేశ్, శ్రీనివాసులు, కరుణ, అంజాద్‌అలీ, నారాయణ, నర్సయ్య, మధుబాబు, అర్జున్, దీపిక, ఫకీర్‌బాబా, రమేశ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజన్నను దర్శించుకున్న ధర్మపురి ఎమ్మెల్యే



కోడెమొక్కు చెల్లించుకుంటున్న ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి

వేములవాడ టౌన్, డిసెంబర్ 12 : వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారిని ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, నాగిరెడ్డిమండపంలో ఆశీర్వచనం చేయగా, ఆలయ ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్ ఉన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

కోనరావుపేట, డిసెంబర్ 12: దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను పరిష్కరించి వినియోగదారులకు తగిన న్యాయం చేసేలా కృషి చేస్తామని సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. మంగళవారం వేములవాడ సబ్ డివిజన్ పరిధి కోనరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేయగా ఆయన హాజరై మాట్లాడారు. వివిధ గ్రామాల నుంచి 29 మంది విద్యుత్ వినియోగదారులు వచ్చి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వాటిని పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఇక్కడ టెక్నికల్ మెంబర్ రామకృష్ణ, కిషన్, సెస్ ఏఈలు దివ్య, సిద్ధార్థ, మహేశ్, నగేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## ఘనంగా మహా పడిపూజ

చందుర్తి, డిసెంబర్ 12: మండల కేంద్రంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో గూడెం గుట్ట గురుస్వామి పురుషోత్తమాచార్యులు నేతృత్వంలో మంగళవారం మహా పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కలశ ఊరేగింపు, అభిషేకం, కుంకుమ పూజలు చేశారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 200 మంది అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. దాతల సహకారంతో అన్నదానం చేశారు. గురుస్వామి మేడిశెట్టి రాజు, ప్యాక్స్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సర్పంచ్ సిరికొండ ప్రేమలత, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, ఉప సర్పంచ్ సిర్రం తిరుపతి, నాయకుడు సిరికొండ మల్లయ్య ఉన్నారు.

## అనాథ వృద్ధులకు చేయూత

గంభీరావుపేట, డిసెంబర్ 12: మండల కేంద్రలోని మా అనాథ వృద్ధుల ఆశ్రమానికి లయన్స్ క్లబ్ మెంబర్ వంగల రవీందర్ రూ. 5వేల నగదు అందించారు. మంగళవారం వారి పెళ్లి రోజును పురస్కరించుకుని ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులకు తమ వంతుగా ఆర్థిక సాయం అందించామన్నారు. ఇక్కడ మా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు మల్లుగారి నర్సాగౌడ్, ఎల్లారెడ్డిపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పయ్యావుల రామచంద్రం, సభ్యులు నాయిని భాస్కర్, స్వామి ఉన్నారు.

## చలి నుంచి నారును కాపాడుకోవాలి

రుద్రంగి, డిసెంబర్ 12: యసంగిలో చలి ప్రభావం నుంచి నారుమడులను కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి విజయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సేంద్రియ ఎరువులు వర్మి కంపోస్టు, గొర్రె లేదా పశువుల ఎరువును 2 గుంటల నారుమడికి 2 క్వింటాళ్లు వేసుకుని కలియదున్నాలన్నారు. నారు అడుగులో కిలో నత్రజని, 2 కిలోల భాస్వరం, కిలో పొటాష్‌నిచ్చే ఎరువులు వేసుకోవాలని సూచించారు. 10 నుంచి 12 రోజుల దశలో నారు ఆరోగ్యంగా పెరుగడానికి కిలో యూరియాకి 2 గ్రాముల కార్బండాజిమ్, మ్యాంకోజెల్ మిశ్రమాన్ని వేసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో నారుమడిలో నీరు నిండుగా ఉంచి తెల్లవారుజామున తీసివేసి కొత్త నీటిని పెట్టాలన్నారు. జింకులోప నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మైనార్టీ గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్, ఉపాధ్యాయులు

వేములవాడ, డిసెంబర్ 12: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వేములవాడ పట్టణంలోని సాంఘిక సంక్షేమ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజేశ్ మంగళవారం తెలిపారు. అండర్ 14 విభాగంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరిగిన టోర్నమెంట్ సెలక్షన్‌లో అత్యంత ప్రతిభ చూపి మొదటి స్థానం సాధించిన రోమాల శ్యాంకుమార్, దయ్యాల నివేద్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులను ఎస్‌జీఎఫ్ సెక్రటరీ దేవత ప్రభాకర్, పాఠశాల ప్రిన్సిపాల్ అనుమల్ల రాజేశ్, పీఈటీ అక్కినపల్లి దేవయ్య అభినందించారు. వీరు ఈ నెల 13 ,14, 15వ తేదీల్లో మహబూబ్ నగర్ జిల్లాలోని నారాయణపేటలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## మామిడిపల్లిని సందర్శించిన జిల్లా వైద్యాధికారులు



లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి శ్రీరాములు, వైద్యులు

కోనరావుపేట, డిసెంబర్ 12: మామిడిపల్లి లో తీపిరెడ్డి లక్ష్మారెడ్డి అనే రైతు మృతిచెందగా జిల్లా మలేరియా అధికారి శ్రీరాములు తన బృందంతో కలిసి సందర్శించారు. ఈ మేరకు లక్ష్మారెడ్డి డెంగ్యూతో బాధపడుతూ మృతి చెందాడా మరే ఇతర కారణాలతోనైనా మృతిచెందాడా అనే విషయాలపై ఆరా తీశారు. మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దవాఖానలోని చికిత్స రిపోర్ట్ పరిశీలించి, డెంగ్యూతో లక్ష్మారెడ్డి మృతిచెందలేదని చెప్పారు. మృతుడి కుటుంబ సభ్యులతో పాటు చుట్టు పక్కల జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాల సేకరించాలని ఆదేశించారు. వైద్య సిబ్బందిని అప్రమత్తం చేస్తూ గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు పాత వస్తువుల్లో నీటి నిల్వ, ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వ ఉండడం వంటివాటిని గుర్తించి వెంటనే శుభ్రం చేయించాలన్నారు. అంతకుముందు ఆశ కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు జ్వర సర్వే నిర్వహించారు. ఇక్కడ వైద్యులు వేణుమాధవ్, వేణు, సీహెచ్‌వో బాలచంద్రం, హెచ్‌ఈవో లింగం, ఏఎన్‌ఎం వరలక్ష్మి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## దళితుల జీవితాలతో చెలగాటం

కోనరావుపేట, డిసెంబర్ 12: దళితుల జీవితాలతో అధికారులు చెలగాటమాడుతున్నారని బీఎస్పీ మండలాధ్యక్షుడు కుమ్మరి దేవదాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. గతంలో మాజీ నక్సలైట్లు లొంగిపోతే అప్పటి ప్రభుత్వ బతుకుదెరువు కోసం సాగు భూమి ఇచ్చిందన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో అధికారులు భూములను స్వాధీనం చేసుకోవడం సరికాదన్నారు. కొండాపూర్‌కు చెందిన దళిత రైతు మల్యాల నందంకు ఇచ్చిన 116/ఏ సర్వే నంబర్‌లో 1.20 గుంటల భూమి ని అధికారులు మళ్లీ లాక్కోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికారుల చర్యలతో సదరు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడం బాధాకరమన్నారు. కలెక్టర్ చొరవ చూపి బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరారు. ఇక్కడ పులి సునీల్, కుమ్మరి విజయ్, బుట్టి ఇమ్మానియేల్, కిశోర్, అభిషేక్ ఉన్నారు

## వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



తిరుమల వేంకటేశ్వర ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కుటుంబం

వేములవాడ, డిసెంబర్ 12: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం ఆయన తొలిసారిగా సోమవారం కాలినడకన తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లి కుటుంబ సమేతంగా స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం వేములవాడలో ప్రజలకు అందుబాటులో ఉంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోనరావుపేట, డిసెంబర్ 12: మండలంలోని నిజామాబాద్, మర్తనపేట, సుద్దాలలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని సెస్ ఏఈ దివ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా వీటి పరిధిలోని కొలనూర్, మర్తనపేట, ధర్మారం, నిజామాబాద్, మల్కపేట, కనగర్తి, సుద్దాల, మంగళపల్లి, పల్లిమక్త, నాగారం, రామన్నపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

## మల్కపేటలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

కోనరావుపేట, డిసెంబర్ 12: మండలంలోని మల్కపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని కొలనూర్ సింగిల్ విండో డైరెక్టర్ జవ్వాజి దేవయ్య తెలిపారు. గ్రామంలో 195 మంది రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకురాగా 8224 క్వింటాళ్ల ధాన్యం బస్తాలను రైస్ మిల్లులకు తరలించినట్లు పేర్కొన్నారు. కొనుగోలుకు సహకరించిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ సెంటర్ నిర్వాహకుడు జంగిటి శ్రీనివాస్, హమాలీలు, రైతులు ఉన్నారు.

## ఎమ్మెల్యేలను కలిసిన సెస్ చైర్మన్ చిక్కాల

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 12: చొప్పదండి, మానకొండూర్ ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంను సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బోయినపల్లి, ఇల్లంతకుంట సెస్ డైరెక్టర్లు సుధాకర్, మల్లుగారి రవీందర్‌రెడ్డి, అన్నమనేని నర్సింగరావు, రాంరెడ్డి ఉన్నారు.



మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, డైరెక్టర్